క్లుప్తంగా

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

తానూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన తానూరు మండల సర్వసభ్య సమావేశంలో కోరం(నిర్ణీత సభ్యులు) హాజరు కాకపోవడంతో వాయిదా వేసినట్లు సూపరింటెండెంట్ వేణుగోపాల్ తెలిపారు. త్వరలో సమావేశం నిర్వహించే తేదీని ఖరారు చేస్తామని వెల్లడించారు.

జేపీఎస్‌ల హర్షం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న జేపీఎస్‌లు

భైంసారూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను పర్మినెంట్ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం డివిజన్ పరిధిలోని జేపీఎస్‌లు మండలంలోని దేగాం గ్రామంలోని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి నివాసానికి వెళ్లి వారిని పూలమాలలు, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకుడు భూక్య జాన్సన్‌నాయక్ యువసేన ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు సొదాని శ్రీకాంత్‌యాదవ్, బాదురావు, బీఆర్‌ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు స్టీఫెన్, యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

35వ రోజుకు వీవోఏల సమ్మె



సమ్మెలో పాల్గొన్న వీవోఏలు

ఖానాపూర్: నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్‌లో కొనసాగుతున్న వీవోఏల సమ్మె మంగళవారం 35వరోజుకు చేరింది. నాలుగు మండలాల వీవోఏలు మండుటెండల్లో సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని వీవోఏలు కోరారు. కార్యక్రమంలో వీవోఏలు లావణ్య, గంగాధర్, స్వరూప, రవీందర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్ ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరణ

భైంసాటౌన్: సూర్యాపేటలో జూన్ 4న నిర్వహించే తెలంగాణ జన సమితి ప్లీనరీని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం భైంసాలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతభవనం వద్ద కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. సభకు కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో విలాస్, సంతోష్, అవినాశ్, గంగాధర్, సతీశ్, కిరణ్ ఉన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన



ఓలాలో పనులు పరిశీలిస్తున్న సర్పంచ్

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాల ఆవరణ, రోడ్లకు ఇరువైపులా, ఆలయాల వద్ద పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. కాగా ఓలాలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను మంగళవారం సర్పంచ్ కనీస్‌ఫాతిమా పరిశీలించారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



బెండ తోటలో పారుతున్న నీరు

సాక్షి ఎఫెక్ట్..

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్, పొట్టపెల్లి(కే) గ్రామాల్లో ఇటీవల ఈదురుగాలులకు స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో రైతులు పడుతున్న ఇబ్బందులపై సోమవారం సాక్షిలో మృత్యుపాశాలు అనే శీర్షికన కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన విద్యుత్ అధికారులు మంగళవారం రాచాపూర్‌లో విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు. దీంతో పది రోజుల తర్వాత రైతులు తమ కూరగాయల పంటలకు నీళ్లు అందించి వాటిని కాపాడుకున్నారు.

వరిగడ్డి వృథాకు చెక్

- గడ్డి కట్టలు కట్టే యంత్రంతో రైతులకు తగ్గిన శ్రమ
- తీరిన పశుగ్రాసం కొరత



మండల కేంద్రంలో యంత్రంతో కట్టిన గడ్డి కట్టలు

లక్ష్మణచాంద: వ్యవసాయంలో యాంత్రీకరణ రోజురోజుకూ పెరుగుతుండటంతో రైతులకు శ్రమ తగ్గుతుంది. దీంతో నాటు వేసేటప్పటి నుంచి కోత కోసే వరకు యంత్రాలనే ఉపయోగిస్తున్నారు. గతంలో కూలీలు కోసిన వరిని పశువులతో తొక్కించి గడ్డిని వేరు చేసేవారు. దీంతో పశువులకు సరిపడ గడ్డి లభించేది. కాలక్రమేణా హార్వెస్టర్లతో పొలం కోతలు చేపట్టడంతో పశుగ్రాసం కొంత వృథా అవడం ప్రారంభమైంది. తాజాగా హార్వెస్టర్లతో కోసిన గడ్డిని కట్టలు కట్టడానికి అన్నదాతలు గడ్డి కట్టే టేలర్‌ను వినియోగిస్తున్నారు. దీంతో ఎండు గడ్డి వృథా కాకుండా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

ఎకరాకు 40 నుంచి 50 కట్టలు..

హార్వెస్టర్‌తో పొలం కోసిన తర్వాత టేలర్‌ను ట్రాక్టర్‌కు బిగించి గడ్డి కట్టలు కడుతారు. భూమి మీద పడిన వరిగడ్డిని కట్టలుగా కడుతుంది టేలర్ మిషన్. ఇలా ఎకరం పొలంలో కట్టలు కట్టడానికి గంట సమయం పడుతుంది. ఎకరంలో దాదాపు 40 నుంచి 50 వరకు గడ్డి కట్టలు వస్తాయి. ఒక్కో కట్టకు టేలర్ యంత్రం వారు రైతు నుంచి రూ.35 నుండి రూ.40 వరకు వసూలు చేస్తున్నారు. ఇలా కట్టిన కట్టలను ట్రాక్టర్ సాయంతో ఇంటికి తెచ్చుకొని నిల్వ చేసుకుంటున్నారు.

మంచి డిమాండ్....

యాసంగిలో వరి గడ్డికి మంచి డిమాండ్ ఉంది. గతంలో పొలం కోసిన తర్వాత గడ్డిని కాల్చే రైతులు కూడా కట్టలు కట్టించి విక్రయిస్తున్నారు. వరి గడ్డి లేని రైతులు తమ పశువుల కోసం మార్కెట్‌లో ఒక్కో కట్టకు రూ.70 నుంచి రూ.80 వరకు చెల్లించి పశుగ్రాసం కొనుగోలు చేస్తున్నారు.

కట్టలు నిల్వ చేస్తున్నా



నాకు రెండు గేదెలు ఉన్నాయి. దీంతో వాటి మేత కోసం ఎకరం పొలంలో వరిగడ్డి కట్టలు కట్టించి ఇంటి తీసుకొచ్చాం. కట్టలు కడితే గడ్డి ఎక్కువ కాలం నిల్వ ఉండటంతోపాటు వృథా కాదు. – గంగారాం,రైతు, పొట్టపెల్లి

ఖర్చులు తగ్గాయి



గతంలో వరి గడ్డిని ఎదిరి దానిని వాము వేయడానికి రోజుకు ఒక్కో కూలీకి రూ.500 అయ్యేవి. టేలర్ యంత్రం రావడంతో కట్టలు కట్టడం వల్ల కూలీల ఖర్చులు తగ్గాయి. సమయం వృథా అవడం లేదు. – గంగన్న, రైతు, లక్ష్మణచాంద

మిషన్ భగీరథ గుంతలతో ముప్పే



బట్టిగల్లీ హనుమాన్ మందిరం వద్ద గుంత



జీబు అడ్డా వద్ద తవ్వి వదిలేసిన గుంత

కుభీర్: మండల కేంద్రంలో ఏటు చూసినా మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలే దర్శనమిస్తున్నాయి. గతంలో పనులు సక్రమంగా చేయకపోవడంతో తరచుగా పైపులైన్లు పగిలి లీకేజీలు ఏర్పడుతున్నాయి. దీంతో పైపులైన్ మరమ్మతుల కోసం వారం కిందట రోడ్డు పక్కన గుంతలు తవ్వి ఇప్పటికీ పూడ్చివేయలేదు. దీంతో వాహనదారులు, ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. బట్టిగల్లి హనుమాన్ మందిరం వద్ద, బట్టిగల్లీ చౌరస్తాలో, జీబ్ అడ్డాలో, దొంతుల గణేశ్ ఇల్లు వద్ద, బోయిగల్లీలో పైపులైన్ మరమ్మతుల కోసం గుంతలు తవ్వి వదిలేశారు. దీంతో రాత్రివేళ రాకపోకలు సాగించే ప్రజలు ఈ గుంతల్లో పడిపోయే ప్రమాదం ఉంది. వెంటనే పైపులైన్లకు మరమ్మతులు చేయించి.. గుంతలు పూడ్చివేయాలని స్థానికులు వేడుకుంటున్నారు. ఈ విషయమై పంచాయతీ సిబ్బందిని అడిగితే ముధోల్ నుంచి మెకానిక్ రాగానే మరమ్మతులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

రక్షణ చట్టం అమలు చేయాలి



కోర్టు ఆవరణలో న్యాయవాదుల నిరసన

నిర్మల్‌టౌన్: న్యాయవాదుల రక్షణ చట్టం కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని నిర్మల్ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ లింగయ్య డిమాండ్ చేశారు. న్యాయవాది యుగేందర్‌పై జరిగిన దాడి నిరసిస్తూ మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. న్యాయవాదులపై దాడులు సరికాదంటూ మండిపడ్డారు. ఇందులో న్యాయవాదులు వీవీ రమణారావు, గంగాధర్, మహేందర్, జగన్, ఖాజా పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏవో గణేశ్

తానూరు: నకిలీ విత్తనాలు అమ్మితే డీలర్లపై చర్యలు తీసుకుంటామని ఏవో గణేశ్ అన్నారు. వానాకాలం సాగు నేపథ్యంలో మంగళవారం తానూరులోని ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కాలం చెల్లిన, నకిలీ విత్తనాలు, మందులు అమ్మితే లైసెన్సు రద్దుతోపాటు వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్యాకింగ్ లేని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయవద్దని రైతులకు సూచించారు. కొనుగోలు సమయంలో తప్పనిసరిగా రశీదులు పొందాలన్నారు.

అనంతరం మండల కేంద్రంలోని పలు ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేసి విత్తనాల బ్యాగులు, ప్యాకింగ్‌లు పరిశీలించారు. వారి వెంట ఏఈవోలు తదితరులు ఉన్నారు.

వీరన్న ఆశయ సాధనకు కృషి చేయాలి

ఖానాపూర్: వీరన్న ఆశయ సాధనకు కృషి చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని బహుజన కమ్యూనిస్ట్ పార్టీ రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి పసుపుల వెంకన్న అన్నారు. మంగళవారం నిజామాబాద్‌లో పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన మారోజు వీరన్న 24వ వర్ధంతి సభకు వారు హాజరై మాట్లాడారు. పూలే, అంబేద్కరిస్ట్, కమ్యూనిస్టులను ఐక్యం చేయడమే కామ్రేడ్ మారోజు వీరన్నకు మనం అర్పించే నివాళి అని పేర్కొన్నారు. అనేక కారణాలతో వీరన్న నిర్మించిన ఉద్యమం ఆగిపోయినప్పటికీ ఆయన వేసిన భావజాల విత్తనాలు సమాజం నిండా విస్తరించుకుంటున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

‘కేసీఆర్ సర్కారు పతనం ఖాయం’



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సర్సాగౌడ్

దిలావర్‌పూర్: సకల జనులతో కలిసి తెలంగాణ సాధించుకుంటే రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన కేసీఆర్ సర్కార్ పతనం ఖాయమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి సర్సాగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఏకనాథ ఆలయ ప్రాంగణంలో మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు పీసరి శైలేశ్వర్ అధ్యక్షతన జరిగిన ఓబీసీ మోర్చా మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీతోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమని.. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కారును తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట సత్యనారాయణ, దిలావర్‌పూర్ సర్పంచ్ జంగం వీరేశ్, కారగిరి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి కోడె ముత్యం, సాయినాథ్, ఉదయ్‌గౌడ్, రాజేశ్వర్, భోజారాం తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతల నిర్మాణం



కొలతలు తీసుకుంటున్న అధికారులు

కుభీర్: మండలంలోని చొండి, పాంగ్ర గ్రామాల్లో సామాజిక ఇంకుడుగుంతల నిర్మాణానికి మంగళవారం అధికారులు శ్రీకారం చుట్టారు. ముందుగా పంచాయతీ కార్యాలయాల ఆవరణలో వర్షపు నీరు వృథాగా పోకుండా ఇంకుడుగుంతలు నిర్మిస్తున్నారు. తర్వాత పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్మిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఎంపీడీవో లింబాంద్రి, ఎంపీవో కవిరాజు, ఏపీవో హరిలాల్, టీఏ సాగర, సర్పంచ్ చంద్రకాంత్ ఉన్నారు.

పాడి రైతులకు ముద్ర రుణాలు

లోకేశ్వరం: పాడి రైతులకు ముద్ర రుణాలు అందిస్తామని.. సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలని అబ్దుల్లాపూర్ ఎస్‌బీఐ మేనేజర్ తిరుమలేశ్ అన్నారు. మంగళవారం పిప్రి, రాయపూర్‌కాండ్లీ, లోకేశ్వరం గ్రామాల్లో ముద్ర రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులను వివరాలు తెలుసుకున్నారు. ఐకేపీ సీసీ రాజేశ్వర్, భైంసా బీఎంసీ ఇన్‌చార్జి మేనేజర్ గజ్జారాం, నిర్మల్ డెయిరీ మేనేజర్ దస్రునాయక్, సూపర్‌వైజర్ దండే రమేశ్, పాలమిత్రలు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ కార్యవర్గం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆలయ కమిటీ అధ్యక్షుడిగా బెజ్జారపు రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా బావండ్లపెల్లి నాగభూషణం, ఉపాధ్యక్షుడిగా శ్రీపాద శేషాద్రి, కోశాధికారిగా గూడురు పోశెట్టి, సంయుక్త కార్యదర్శిగా మిమ్మడి భీమేశ్‌ను ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన

కుభీర్: మండలంలోని పల్సి గ్రామంలో మంగళవారం వ్యవసాయాధికారులు ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఉపాధిహామీ ద్వారా అందిస్తున్న రాయితీలు, పంట సాగుతో వచ్చే లాభాలను వివరించారు. ఈ సందర్భంగా పలువురు సాగుకు ముందుకొచ్చి తమ పేర్లు నమోదు చేసుకున్నారు. సదస్సులో సర్పంచ్ కవిత, మేనేజర్ వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయాధికారి వికారుద్దీన్, మాజీ సర్పంచ్ హన్మండ్లు, నాయకులు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

లక్ష్మణచాంద: మామడ మండలం లింగంపెల్లికి చెందిన యశ్వంత్ నాయక్ అనే బాలుడు తలసేమియా వ్యాధితో బాధపడుతూ నిర్మల్ ఏరియా ఆసుపత్రిలో చేరారు. వైద్యులు పరీక్షించి రక్తం అవసరమని చెప్పగా బాలుడి కుటుంబసభ్యులు సుకియా అనే లక్ష్మణచాంద మండల వాట్సాప్ గ్రూప్‌ను సంప్రదించారు. వాట్సాప్ గ్రూపు ద్వారా విషయం తెలుసుకున్న లక్ష్మణచాంద పీహెచ్‌సీలో పని చేస్తున్న మండల ఆరోగ్య కార్యకర్త శివకృష్ణ నిర్మల్ ఏరియా ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు.

విద్యుత్ స్తంభాల తొలగింపు ప్రారంభం

ఖానాపూర్: పట్టణంలోని రోడ్డు వైడింగ్ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాల తొలగింపు ప్రక్రియను అధి కారులు ప్రారంభించారు. గతంలో పలుమార్లు సంబంధిత అధికారులు సర్వే చేసినప్పటికీ మంగళవారం అధికారికంగా విద్యుత్ సరఫరా నిలిపివేసి ప్రత్యేక సిబ్బందితో సుమారు కిలోమీటర్ మేర పనులు చేపట్టారు. ఏఈ తిరుపతి ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పాత స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు.

నేడు చెక్కులు పంపిణీ

కుభీర్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు బుధవారం కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పంపిణీ చేస్తారని ఎంపీపీ లక్ష్మీబాయి ఓ ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, లబ్ధిదారులు ఉదయం 11 గంటలకు రావాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్ — హరిత మొక్కలను కాపాడండి



కడెం: అడవిలో మంటలు వ్యాపించకుండా అటవీశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఫైర్‌లైన్స్ పనులతో మండలంలోని సర్సాపూర్ గ్రామ సమీపంలో ప్రధాన రహదారి పక్కన నాటిన మొక్కలు కాలి బూడిదవుతున్నాయి. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు అగ్నికి ఆహుతి కాకుండా సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

గంగపుత్రులకు న్యాయం చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

లోకేశ్వరం: మత్స్య సహకార సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే పదవుల్లో మొదటి ప్రాధాన్యత ఇచ్చి గంగపుత్రులకు న్యాయం చేయాలని గంగపుత్ర సంఘం మండలాధ్యక్షుడు కొట్టాల భూమేశ్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా భూమేశ్ మాట్లాడుతూ రాష్ట్ర మత్స్య సహకార పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ పిట్టల రవీందర్ ముదిరాజ్‌ను తొలగించి చేపల వృత్తినే కులదైవంగా భావించే గంగపుతులకే చైర్మన్ పదవి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మన్మద్ గ్రామ సొసైటీ అధ్యక్షుడు నాయిలు, విఠల్, పోశెట్టి, గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రైతుల ఇబ్బందులు పట్టించుకోని ప్రభుత్వం



మాట్లాడుతున్న వినోద్‌నాయక్

కడెం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏఐసీసీ రిసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ ఆరోపించారు. మంగళవారం మండలంలోని పెద్దూర్, పెద్దూర్‌తండా, కొత్తమద్దిపడగ గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి మాట్లాడారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేస్తే వారి పక్షాన ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సలీం, రహీం, బన్నీ, జగదీశ్ తదితరులు ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతులెప్పుడో?



కంకర తేలి గుంతలమయంగా రోడ్డు

- గుంతలమయంగా దిలావర్‌పూర్–సారంగపూర్ మండలాలను కలిపే రోడ్డు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

దిలావర్‌పూర్: మండల కేంద్రం సమీపంలోని నిర్మల్–భైంసా ప్రధాన రహదారి నుంచి సారంగపూర్ మండలానికి వెళ్లే రోడ్డు మార్గం పూర్తిగా దెబ్బతినడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా రెండు మండలాలకు దూర భారం తగ్గించేందుకు అటవీప్రాంతం గుండా వేసిన ఈ రోడ్డు మార్గం ప్రస్తుతం పూర్తిగా గుంతలమయంగా మారింది.

4.7 కిలోమీటర్ల మేర మరమ్మతులు చేయించాలి

దిలావపూర్ మండల పరిధిలో కిలోమీటరుకుపైగా ఈ రోడ్డు మార్గం ఉండగా సారంగపూర్ మండల పరిధిలోని బీరవెల్లి శివారు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని గ్రామం వరకు మరో మూడు కిలోమీటర్లు ఉంటుంది. చిరు వ్యాపారాలు మొదలుకుని రైతులు, అలాగే జిల్లాలో ప్రసిద్ధి చెందిన అడెల్లి మహాపోచమ్మ ఆలయానికి వెళ్లే భక్తులు, భైంసా వైపు, మహారాష్ట్ర నుంచి వచ్చే భక్తులు సైతం ఈరోడ్డు మార్గం ద్వారానే ఆలయానికి వచ్చిపోతుంటారు. దిలావర్‌పూర్ గ్రామ సమీపం నుంచి బీరవెల్లి వరకు ఉన్న 4.7కిలో మీటర్ల మేర రోడ్డు మార్గానికి మరమ్మతులు చేయిస్తే రెండు మండలాలకు రవాణా మార్గం సులభతరం కానుంది. అలాగే మహారాష్ట్ర, భైంసా వైపు నుంచి అడెల్లి దేవస్థానానికి వచ్చే భక్తులకు సైతం ఇబ్బందులు ఉండవని పేర్కొంటున్నారు.

అధికారులు స్పందించాలి..

అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపడితే తమకు ఇబ్బందులు దూరం అవుతాయని ప్రజలు పేర్కొంటున్నారు.

రూ.2.50 కోట్లతో ప్రతిపాదనలు పంపాం

దిలావర్‌పూర్ సమీపంలోని నిర్మల్–భైంసా రహదారి నుంచి బీరవెల్లి గ్రామం వరకు ఉన్న 4.7 కిలోమీటర్ల రోడ్డు మార్గం ఆధునీకరించేందుకు రూ.రెండున్నర కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు పంపించాం. దిలావర్‌పూర్ మండలానికి సంబంధించి కిలోమీటరు కాగా సారంగపూర్ మండలానికి సంబంధించి 3.7కిలోమీటర్లు మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డును ఆధునీకరించి ప్రజల ఇక్కట్లను తొలగిస్తాం.

– శివకృష్ణ, పీఆర్ ఏఈ, దిలావర్‌పూర్

ఆశావర్కర్ల డిమాండ్లు నెరవేర్చాలి

కడెం: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో డాక్టర్ శివకుమార్‌కు మండలంలోని ఆశావర్కర్లు వినతిపత్రం అందజేశారు. ఆశాల పరీక్షల రద్దు చేసి.. రూ.18 వేల పారితోషికం చెల్లించాలన్నారు. పనిభారం తగ్గించి జాబ్‌చార్ట్ విడుదల, ప్రసూతి సెలవులు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఆశావర్కర్లు జ్యోతి, గంగారాజు, భాగ్యలక్ష్మి, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.